# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 80 | పేజీలు: 4 | వెల: 4/- | శనివారం ● 12, అక్టోబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి



పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు

నమస్తే ఉదయం


## దసరా శుభాకాంక్షలు

**సెలవు..**

విజయదశమి పర్వదినం సందర్భంగా శనివారం 'నమస్తే ఉదయం' కార్యాలయానికి సెలవు. ఆదివారం సంచిక వెలువడదు. పునర్దర్శనం సోమవారం.



- ఎం దామోదర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్
నమస్తే ఉదయం




### గురుకులాలతో పేద విద్యార్థులకు

# ఉజ్వల భవిత

**5వేల పాఠశాలలను మూసేసిన ఘనుడు కెసిఆర్**

**లక్షల కోట్లు అప్పులు చేసినా.. టీచర్ల నియామకం చేపట్టలే**

**పాఠశాలల్లో కనీస మౌళిక వసతులు విస్మరించారు**

**అందరికీ సమాన విద్యా అందించాలన్నదే సర్కార్ లక్ష్యం**

**కొందుర్గు గురుకుల స్కూల్ శంకుస్థాపనలో సీఎం రేవంత్ రెడ్డి**

**రంగారెడ్డి,అక్టోబర్ 11(నమస్తే ఉదయం):** తెలంగాణలో ఉన్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. వైద్య సదుపాయాలను మెరుగుపరిచి ఆరోగ్య తెలంగాణను ఆవిష్కరిస్తామన్నారు. గత కెసిఆర్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేయడమే గాకుండా విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. దాదాపు ఐదువేల పాఠశాలలను మూసేసిందని అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొందుర్గులో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి సీఎం రేంవత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఒక్కో స్కూల్ భవనాన్ని రూ.150 కోట్లతో 25 ఎకరాల్లో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కొందుర్గులో ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. చదువుకున్న విద్యార్థుల కొలువుల గురించి కేసీఆర్ ఎప్పుడైనా ఆలోచించారా? అని ప్రశ్నించారు. పేదలంతా గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుంటూ బతకాలని కేసీఆర్ భావించారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అందరి పార్టీ, ఇది పేదల ప్రభుత్వం. లోక్‌సభ ఎన్నికల్లో భారాసకు సున్నా సీట్లు వచ్చినా.. వారి ఆలోచనా విధానం మారలేదు. కేసీఆర్ గురుకుల పాఠశాలలకు ఎక్కడా సరైన భవనాలు నిర్మించలేదు. పేద విద్యార్థులు, చదువుకునే బదులు, మిగతా.. 2లో

### రాష్ట్ర వ్యాప్తంగా

## స్కూళ్ల పండగా

**ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు అట్టహాసంగా శంకుస్థాపన**

**మారనున్న విద్యారంగ పరిస్థితులు**

**పేదల విద్యకు కట్టుబడి ఉన్నామని మంత్రుల ప్రకటన**


**హైదరాబాద్,అక్టోబర్ 11(నమస్తే ఉదయం):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సిద్ధం చేస్తున్న ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్ల భవనాలకు మిగతా.. 2లో



### నోబెల్ శాంతి బహుమతికి జపాన్‌కు చెందిన

## నిహాన్ హిడాంక్యో సంస్థ ఎంపిక


**స్టాక్‌హోం,అక్టోబర్11(నమస్తే ఉదయం):** ప్రపంచ ప్రఖ్యాత నోబెల్ శాంతి బహుమతి -2024 జపాన్‌కు చెందిన నిహాన్ హిడాంక్యో సంస్థను వరించింది. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిల్లో అణుదాడి నుంచి బయటపడిన బాధితుల పక్షాన ఈ సంస్థ పోరాడుతోంది. ప్రపంచాన్ని అణ్వాయుధ రహితంగా మార్చేందుకు కృషి చేస్తుండడంతోపాటు బాధితుల జీవితగాథల్ని ఉదహరిస్తూ మరోసారి అణ్వాయుధాలను వాడకుండా ప్రయత్నాలు చేస్తున్నందుకు ఈ ప్రతిష్టాత్మక పురస్కారం దక్కింది. హిరోషిమా, నాగసాకి అణుబాంబు నుంచి ప్రాణాలతో బయటపడిన వారు శారీరక సమస్యలు, విషాద జ్ఞాపకాలతో జీవిస్తున్నప్పటికీ వారిని గౌరవించాలని భావిస్తున్నాం. శాంతి, విశ్వాసం పెంపొందించడానికి వారి విలువైన అనుభవాలను ఉపయోగించుకునేందుకు శాంతి బహుమతిని ఇవ్వాలని నిర్ణయించాం' అని నోబెల్ బృందం పేర్కొంది. జపాన్ నగరాల్లో అణ్వాయుధాల బారిన పడిన బాధితుల ఉద్యమాన్ని హిబాకుషా గా పేర్కొంటారు. దీనిలో జపాన్‌కు చెందిన 47 రాష్ట్రాల్లో పోరాడుతున్న సంస్థల ప్రతినిధులు ఉన్నారు. మరోవైపు, వైద్య విభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రదానం అక్టోబర్ 14వరకు కొనసాగనుంది. వైద్య, భౌతిక, రసాయన శాస్త్రాలతోపాటు సాహిత్యంలో నోబెల్ గ్రహీతల పేర్లను ఇప్పటికే వెల్లడించగా.. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతిని ప్రకటించారు. అక్టోబర్ 14న అర్థశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లను వెల్లడిస్తారు.




## టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా నోయల్ టాటా

- బోర్డు ఏకగ్రీవ నిర్ణయంతో ఊహాగానాలకు చెక్

**ముంబై,అక్టోబర్ 11(నమస్తే ఉదయం):** టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా నోయల్ టాటా నియమితులయ్యారు. రతన్ టాటా తుదిశ్వాస విడిచిన నేపథ్యంలో ఆయన వారసుడిగా నోయల్ టాటాను ఎంపిక చేస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. నోయల్ రతన్ టాటాకు వరసకు సోదరుడు అవుతారు. సవతి తల్లి సిమోన్ టాటా కుమారుడు. ఆయన ఇప్పటికే టాటా గ్రూపులోని పలు కంపెనీల్లో వివిధ కీలక హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ట్రెంట్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా ఇంటర్నేషనల్ కంపెనీలకు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. టాటా స్టీల్, టైటాన్‌కు మిగతా.. 2లో



## మూసీ మురికిని ఏం చేస్తారు..?

- మూసీలో ఉన్నవారంతా పేదలే
- వారికి అండగా బిజెపి ఉంటుంది
- 370 ఆర్టికల్ ముగిసిన చరిత్ర
- మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,అక్టోబర్11(నమస్తే ఉదయం):** మూసీ పరివాహక ప్రాంతాల్లో పేదోళ్ల ఇళ్లు కూల్చడాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి మరోసారి ఖండించారు. వారికి బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు ఎంతో కష్టపడి చిన్నచిన్న స్థలాలు కొనుక్కున్నారని, వారికి ప్రభుత్వమే అన్నీ అనుమతులు ఇచ్చి ఇప్పుడు కూలుస్తామని చెప్పడం దారుణమని ఆయన అన్నారు. కూల్చివేతలు అంత ఈజీ కాదని, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డే స్వయంగా మూసీ ప్రాంతంలో పర్యటించి ప్రజలను ఒప్పించాలని డిమాండ్ మిగతా.. 2లో






### నిరుద్యోగులకు ప్రభుత్వం

## దసరా కానుక

- ఆరోగ్య శాఖలో మరో 371 పోస్టులకు నోటిఫికేషన్

**హైదరాబాద్,అక్టోబర్11(నమస్తే ఉదయం):** నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక ప్రకటించింది. ఆరోగ్య శాఖలో మరో 371 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 271 నర్సింగ్ ఆఫీసర్, 99 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి సంబంధించి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. రేవంత్ సర్కార్ ఇప్పటికే 7,300 పోస్టులను భర్తీ చేసింది. మరో 6,500 పోస్టుల భర్తీ పక్రియ కొనసాగుతోంది. తాజాగా మరో 272 నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్ నర్స్), 99 ఫార్మసిస్ట్(గ్రేడ్ 2) పోస్టుల భర్తీ చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి శుక్రవారం నాడు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. తాజాగా ప్రకటనతో మొత్తం పోస్టుల సంఖ్య 732కు పెరిగింది. అక్టోబర్ 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తు చేసేందుకు గడువు ఇచ్చింది. నవంబర్ 30వ తేదీన రాత పరీక్ష నిర్వహించ నున్నారు. గత నెలలో విడుదల చేసిన మిగతా.. 2లో

## ఎస్సీ వర్గీకరణకు అడుగు

- జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నియామకం

**హైదరాబాద్,అక్టోబర్11(నమస్తే ఉదయం):** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ షమీమ్ అక్తర్‌ను కమిషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని కమిషన్‌కు ప్రభుత్వం సూచించింది. సుప్రీంకోర్టు తీర్పునకు అను గుణంగా ఎస్సీ కులాల వర్గీకరణ అమలుకు నియమించిన ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని, ఆ తర్వాతే ఉద్యోగ నియామకాలకు సంబంధించి కొత్త నోటిఫికేషన్లు వేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉపకులాల వారీగా ఎస్సీల వెనుకబాటుతనాన్ని కమిషన్ అధ్యయనం చేయనుంది. ఎస్సీ వర్గీకరణ కోసం 2011 జనాభా లెకలను పరిగణనలోకి తీసుకొని, ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని గడువు నిర్దేశిరచారు. కమిషన్‌కు అవసరమైన సమాచారాన్ని అన్ని విభాగాల నుంచి అందేలా మిగతా.. 2లో



### దసరా శుభాకాంక్షలు తెలిపిన

## సిఎం రేవంత్

- ప్రజలకు కెసిఆర్ శుభాకాంక్షలు

**హైదరాబాద్,అక్టోబర్11(నమస్తే ఉదయం):** దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. దసరా రోజున కుటుంబంలోని సభ్యులందరూ ఒకే చోట చేరి సామూహికంగా సంబురాలు జరుపుకోవడం తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలాయ్ బలాయ్ తీసుకోవడం.. పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం.. శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకమని సీఎం గుర్తు చేశారు. తెలంగాణకు నిత్య విజయాలు కలిగాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలను ప్రసాదించాలని సీఎం దుర్గామాతను ప్రార్థించారు. అలాగే రాష్ట్ర ప్రజలకు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మిగతా.. 2లో





### కులమతాలకు అతీతంగా

## అందరికీ విద్య

- విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు
- ప్రపంచంతో పోటీపడే విధంగా తీర్చిదిద్దే లక్ష్యం
- లక్ష్మీపురంలో గురుకులానికి శంకుస్థాపనలో భట్టి

**ఖమ్మం,అక్టోబర్ 11(నమస్తే ఉదయం):** కుల, మతాలకు అతీతంగా అందరినీ సమన్వయపరుచుకుంటూ ముందుకెళు తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అన్ని వర్గాల వారి కోసం విద్యా బుద్ధులు నేర్పేందుకు నాంది పలికామన్నారు. చదువు, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలోని లక్ష్మీపురంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలకు శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

'ఈ ఏడాది సమీకృత గురుకులాలకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. సంకల్పం, చిత్తశుద్ధి ఉంటే సాధ్యం కానిదేది లేదు. వచ్చే విద్యా సంవత్సరానికి గురుకుల భవనాలు పూర్తి కావాలి. వీటిలో సకల సౌకర్యాలు పొందు పరుస్తున్నాం. ప్రభుత్వ విద్యావిధానం నిర్వీర్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. విద్యాసంస్థల విద్యుత్ బిల్లులను మిగతా.. 2లో

## ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు

- ప్రభుత్వం జీవో జారీ

**హైదరాబాద్,అక్టోబర్11(నమస్తే ఉదయం):** ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం జీవో జారీ చేసింది. పంచాయతీ, మున్సిపల్, వార్డు స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామస్థాయిలో సర్పంచి లేదా ప్రత్యేక అధికారి, కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ చైర్మన్‌గా మున్సిపాలిటీ స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు ఆఫీసర్ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ కన్వీనర్‌గా ఉంటారని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. ఇద్దరు ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు, ముగ్గురు స్థానికులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. అధికారులతో మిగతా.. 2లో



# రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్ల పండగా



(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపనలు జరిగాయి. రాష్ట్రంలోని దాదాపు 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో భవనాల నిర్మాణానికి మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పునాదిరాయి వేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని కొందుర్గులో ఏర్పాటు చేయనున్న బడి భవనాలకు ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. మధిర నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఖమ్మంలో పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా షాద్‌నగర్,మధిర, కొడంగల్, ఖమ్మం, హుస్నాబాద్, నల్లగొండ, హుజూర్‌నగర్, మంథని, ములుగు, పాలేరు, వరంగల్, కొల్లాపూర్, అందోల్, చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి, అచ్చంపేట్, స్టేషన్ ఘన్‌పూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూరు, పరకాల, నారాయణ్ ఖేడ్, దేవరకద్ర, నాగర్ కర్నూల్, మానకొండూర్, నర్సంపేట నియోజకవర్గాల్లో శంకుస్థాపనలు జరిగాయి. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఇక్కడ రూ.125 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. నల్లగొండలోని గందంవారి గూడెంలో ఏర్పాటు చేయబోయే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌పై విమర్శలు చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో పడుకుంటే కేటీఆర్, హరీష్‌రావు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లలో ఒక్క టీచర్ ఉద్యోగం ఇవ్వలేదని కేవలం ఈ కాలంలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. తాము మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశామని, ఉద్యోగాలు ఇస్తున్నామని గుర్తు చేశారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు కూడా త్వరలోనే ఇస్తామని తెలిపారు.

ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూమి పూజ చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించారు. చిత్తశుద్ధితో పేదల అభివృద్ధి కోసం పాటుపడుతున్నామని అందుకే ఇలాంటి పాఠశాలలు 28 ఏర్పాటు చేస్తున్‌ట్టు చెప్పారు. మౌలిక సదుపాయలు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పథకం కింద రూ.657 కోట్లు కేటాయించినట్టు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం స్కూళ్లు పెట్టి వసతులు కల్పించలేదన్నారు. ఇప్పుడు తాము మాత్రం రూ.125 నుంచి రూ.150 కోట్లతో అద్భుతమైన నిర్మాలు చేస్తున్నట్టు వెల్లడించారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని లక్ష్మీపురంలో ఏర్పాటు చేయబోయే స్కూల్‌కు శంకుస్థాపన చేశారు డిప్యూటీ సీఎం మల్ల భట్టి విక్రమార్క. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసిందన్నారు. వాటిని సరిచేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో ప్రజల్లో ఐక్యతను పెంపొందించే ప్రయత్నం చేస్తున్నట్టు వెల్లడించారు. ఇక్కడ ప్రపంచ స్థాయి బోధన అందిస్తామన్నారు. మొదటి దశలో 28 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ దశల వారీగా మిగతా నియోజకవర్గాల్లో కూడా కట్టిస్తామన్నారు. పెద్దపల్లి జిల్లాలోని మంథని మండలంలో అడవి సోమన్ పల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. రాష్ట్రంలో విద్యతోపాటు మిగతా రంగాల అభివృద్ధి కోసం తాము సంస్కరణలు తీసుకొస్తున్నామన్నారు శ్రీధర్ బాబు. ఓవైపు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తూనే ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని తెలిపారు. పదేళ్ల పాటు అప్పులు పెరిగాయే తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని విమర్శించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం శంకుస్థాపన చేశారు. పేదలకు ఉన్నత విద్యా కల్పించాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. తొలి దశలో 28 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను తీసుకురావాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న గురుకులాలను కొనసాగిస్తూనే.. అత్యాధునిక వసతులతో సమీకృత భవనాలను నిర్మించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు యా నియోజకవర్గాలతో కూడిన జాబితాను విడుదల చేయడంతోపాటు సంబంధిత ఉత్తర్వులను జారీ చేసింది. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని లక్ష్మీపురం వద్ద నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మోడల్‌ను ఇప్పటికే ఖరారు చేశారు. సుమారుగా 20 ఎకరాల్లో అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, తరగతి గదులు, ప్రయోగశాలలు, ఆట స్థలం, బాలబాలికలకు వేర్వేరు హాస్టళ్లు, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ సిబ్బందికి నివాస సముదాయాలు ఏర్పాటు చేసేలా నమూనా రూపొందించారు. తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, యాంఫ్ థియేటర్ వంటి అధునాత సౌకర్యాలు కల్పిస్తారు. రెండు అంతస్తుల్లో క్లాస్ రూమ్‌లు, మూడు అంతస్తుల్లో బాలబాలికలకు వేర్వేరు హాస్టళ్లు, 5 అంతస్తుల్లో సిబ్బందికి వసతి సౌకర్యాలు.. ఇలా వేర్వేరు బ్లాక్‌లు ఏర్పాటు చేయనున్నారు.

విద్యార్థుల మానసిక ఉల్లాసం కోసం క్రికెట్ గ్రౌండ్, ఫుట్‌బాల్ కోర్టు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్ కోర్టులతోపాటు ఔట్‌డోర్ జిమ్, ఓపెన్ ఎయిర్ థియేటర్ ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో గురుకులంలో 2,560మంది విద్యార్థులు ఉండేలా నిర్మాణాలు చేపట్టనున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసే లైబ్రరీలో 5వేల పుస్తకాలను అందుబాటులో ఉంచనున్నారు. 900 మంది ఒకేసారి కూర్చుని భోజనం చేసేలా డైనింగ్ హాల్‌ను నిర్మించనున్నారు.

# గురుకులాలతో పేద విద్యార్థులకు ఉజ్వల భవిత

(మొదటి పేజీ తరువాయి)

హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను పట్టించుకోలేదు. భారాసకు మాత్రం 33 జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించుకున్నారు. చదువుకునే విద్యార్థులను కూడా కేసీఆర్ కులాల వారీగా విభజించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ వేర్వేరుగా గురుకులాలు పెట్టారు. గత ప్రభుత్వం 5వేల ప్రభుత్వ పాఠశాలలను మూసి వేసింది. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారు. కొన్నేళ్లుగా బదిలీలు, పదోన్నతులు లేకపోవడంతో



టీచర్లలో అసహనం ఏర్పడింది. ఈ ప్రభుత్వం 21వేల మంది టీచర్లకు పదోన్నతులు ఇచ్చి ఒక నమ్మకం కలిగించిందని సీఎం వివరించారు. ఇదిలావుంటే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ ఎందుకు తప్పుపడుతున్నారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో చేరగానే ఆర్ఎస్ ప్రవీణ్ ఆలోచన విధానం మారిందని రేవంత్ అన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఇంకా బానిసలుగానే బతకాలని భావిస్తున్నారా అని సీఎం నిలదీశారు. పదేండ్లలో బర్రెలు, గొర్రెలు ఇచ్చాడే తప్ప మంచి చదువు ఇచ్చారా అని సీఎం ప్రశ్నించారు. విద్యా వ్యవస్థలో మార్పులపై ఎంతో ఆలోచించామని, నిపుణులు, మేధావులతో ఎంతో చర్చించానని సీఎం చెప్పారు. మేధావులతో చర్చించాకే ఈ స్కూళ్ల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందిస్తామని, విద్యా ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 5 వేల ప్రభుత్వ స్కూళ్లను మూసివేసిందని, పేదలను విద్యకు దూరం చేయాలని బీఆర్ఎస్ కుట్ర పన్నిందని సీఎం ఆరోపించారు. ఎలాంటి వివాదం లేకుండా టీచర్ల బదిలీలు చేపట్టామని, అర్హులైన టీచర్లందరికీ ప్రమోషన్లు, బదిలీలు చేశామని డీఎస్సీ నియామకాలను గుర్తు చేశారు. విద్యార్థుల భవిష్యత్ కోసమే



యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌ను తీసుకొచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. బుర్రా వెంకటేశం లాంటి వ్యక్తులు రెసిడెన్షియల్ స్కూళ్లలోనే చదివారని గుర్తుచేశారు. రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్ పాఠశాలలను బాగు చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ రూ.7 లక్షల కోట్లు అప్పు చేశారని, రెసిడెన్షియల్ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించాలనే కనీస ఆలోచన చేయలేదని కేసీఆర్ పాలనపై సీఎం రేవంత్ మండిపడ్డారు. రేవంత్ సర్కార్ 28 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. స్థానిక ఎమ్మెల్యే తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మూసీ మురికిని ఏం చేస్తారు..?

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. మూసీ రిటర్నింగ్ వాల్ నిర్మించి కూడా సుందరీకరణ చేయెచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అన్నీ డ్రైనేజీలు మూసీలోనే కలుస్తున్నాయని, కనీసం శుద్ధి జరగకుండా నేరుగా నదిలోనే ముగురునీరు కలుస్తోందని ఆయన చెప్పారు. గంగా నదిపై కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో శుద్ధి చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మూసీ సుందరీకరణకు రూ.1.50లక్షల కోట్లు అవసరం లేదని స్పష్టం చేశారు. రేస్ కోర్స్ స్థలం అమ్మేసి మరీ సుందరీకరణ చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఎలాన్ లేకుండా ఇళ్లు కూల్చివేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. సీఎం దుందుడుకుగా వ్యవహరిస్తానంటే కుదరదని కేంద మంత్రి హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలాగే ప్రజలపై బెదిరింపులకు పాల్పడిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాకు గవర్నర్ చట్టబద్ధత కల్పించడం సాధారణ పక్రియ అని, బాధితులు ఎవరూ భయపడొద్దని చెప్పారు. మూసీ బాధితుల కోసం బీజేపీ పోరాటం చేస్తోందని ఆయన మరోసారి చెప్పుకొచ్చారు. ప్రజలు బలహీనులు కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైడ్రా అంటే భూతం కాదని, గతంలోనూ అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం కూల్చేదని ఆయన చెప్పారు. అయితే ప్రస్తుతం దాని పేరును మార్చారని, అదే హైడ్రా అని చెప్పారు. హైడ్రా ముందుగా మూసీ నదిలో ఉన్న బస్ డిపో, మెట్రో పిల్లర్స్‌ను కూల్చాలని కేంద్ర మంత్రి డిమాండ్ చేశారు. వాటిని కూల్చకుండా ముందుగా పేదవారి ఇళ్లు ఎలా పడకొడతారంటూ ఆయన ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలోకి వెళ్లి అభిప్రాయాలు తెలుసుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి రావాలని డిమాండ్ చేశారు. మూసీలో కలిసే మురుగునీరు ఏం చేస్తారో ముందు సమాధానం చెప్పాలని సీఎంను డిమాండ్ చేశారు. నగరంలోని అన్ని ప్రాంతాల మురుగు నీరు వచ్చి మూసీలోనే కలుస్తోందని తెలిపారు. దీనిపై సీఎం ముందుగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు తనను సంప్రదించారని వస్తున్న వార్తలను కిషన్ రెడ్డి ఖండించారు. తనను ఇప్పటివరకూ ఎవరూ సంప్రదించలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మూసీ పరివాహక ప్రాంతాల్లో నిర్మాణాలు వెలిశాయని.. 40ఏళ్లుగా అక్కడ నివాసం ఉంటున్న వాళ్లకు రాష్ట్ర ప్రభుత్వమే అన్ని వసతులు కల్పించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో కిషన్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ధనవంతులు ఎవరూ లేరు. పేద ప్రజల ఇళ్లను కూల్చేముందు వాళ్లతో చర్చించిన తర్వాతే ముందుకు వెళ్లాలి. డ్రైనేజీ వ్యవస్థ అంతా మూసీలోనే కలుస్తోంది.. దానికి ప్రత్యామ్నాయం లేకుండా మూసీ సుందరీకరణ ఎలా సాధ్యమవుతుంది? రూ.లక్షన్నర కోట్లతో సుందరీకరణ చేస్తామంటున్న ప్రభుత్వం.. అ నిధులను ఎక్కడి నుంచి సమీకరిస్తుంది? కూల్చివేతల విషయంలో హైడ్రా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం తగదు. సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తే బ్యాంకు రుణాలు ఎవరు చెల్లిస్తారఅని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

ఈ సందర్భంగా జమ్మూకాశ్మీర్ ఎన్నికలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 98శాతం హిందువుల ఓట్లు తమకే వచ్చాయని కిషన్ రెడ్డి చెప్పారు. కశ్మీరీ పండిట్లు మొత్తం తమకే ఓట్లు వేశారని చెప్పారు. ఆర్టికల్ 370రద్దు ఓ చరిత్ర అని, దాన్ని తిరిగి తీసికొని వచ్చే అవకాశమే లేదన్నారు. చిన్న ఘటనకూడా చోటు చేసుకోకుండా 60 శాతం ఓటింగ్ జరిగిందని ఆయన చెప్పారు. ఫేక్ నోట్లు నియంత్రించామని, టెర్రరిజాన్ని అరికట్టగలిగామని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఐఎస్ఐపై కఠిన చర్యల కారణంగానే ఇదంతా జరిగిందని కేంద్ర మంత్రి చెప్పారు. జార్ఖండ్‌లో జరిగే ఎన్నికల్లోనూ తామే గెలవబోతున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌ను ప్రపంచ దేశాల ముందు దోషిగా నిలబెట్టామని, చైనా ఆహారం, ఆయుధాలు పాకిస్థాన్‌కు ఇస్తోందని మండిపడ్డారు. కాశ్మీర్‌లో పాక్ ఆటలు ఇకపై సాగనివ్వమని కిషన్ రెడ్డి హెచ్చరించారు. అర్టికల్ 370 విషయంలో పునరాలోచన లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తేల్చి చెప్పారు. పదేళ్ల భాజపా పాలనలో భారతదేశం అంతర్జాతీయంగా బలపడుతోందన్నారు.

# నిరుద్యోగులకు ప్రభుత్వం దసరా కానుక

(మొదటి పేజీ తరువాయి)

ఫార్మసిస్ట్, నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌కి అనుబంధంగా ఈ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు బోర్డు తెలిపింది. గత నెలలో 2,050 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్‌కు ఇప్పుడు అదనంగా మరో 272 పోస్టులను జతచేసింది. దీనితో మొత్తం భర్తీ చేయనున్న నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు 2,322కి చేరాయి. ఈ నెల 14లోగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాని బోర్డు సూచించింది. నవంబర్ 17న కంప్యూటర్ విధానంలో పరీక్ష నిర్వహించ నున్నట్లు పేర్కొంది. అదేవిధంగా గతంలో ప్రకటించిన 633 ఫార్మసిస్ట్ పోస్టులకు అదనంగా మరో 99 పోస్టులను కలుపుతూ తాజాగా మరో నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో మొత్తం ఫార్మసిస్ట్ పోస్టుల సంఖ్య 732కి చేరింది. ఫార్మసిస్ట్ పోస్టులకు సంబంధించి ఈ నెల 21 వరకు దరఖాస్తులు స్వీకరించి నవంబర్ 30న పరీక్ష నిర్వహిస్తామని బోర్డు ప్రకటించింది.



# డీఎస్పీగా క్రికెటర్ సిరాజ్

## నియామక పత్రం అందచేసిన డిజిపి

హైదరాబాదీ,అక్టోబర్11(నమస్తే ఉదయం): టీమిండియా క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఆగస్టు నెలలో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 78లో 600 చదరపు గజాల స్థలాన్ని సిరాజ్‌కు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా సిరాజ్‌కు డీఎస్పీ పోస్టు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ జితేందర్ సిరాజ్‌కు డీఎస్పీ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖకు సిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్ భారత దేశానికి, మన తెలంగాణకు గొప్ప పేరు, గౌరవాన్ని తెచ్చాడంటూ మొహమ్మద్ సిరాజ్‌ను సీఎం అభినందించారు. టీ20 వరల్డ్ కప్‌ను గెలిచిన అనంతరం హైదరాబాద్‌కు చేరిన సిరాజ్ మంగళవారం ఉదయం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సిరాజ్‌ను సీఎం ఘనంగా సన్మానించారు. సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్‌లో తన అద్భుతమైన ప్రతిభను ప్రదర్శిస్తున్నాడని, అందుకే ఈ రోజు అత్యున్నత స్థాయి క్రికెటర్లలో ఒకడిగా పేరు సంపాధించాడని సీఎం ప్రశంసించారు. భారత ప్లేయర్‌గా ఏడేండ్లుగా సేవలు అందిస్తుండటమేకాక, ఐసీసీ టీ20 వరల్డ్ కప్ టీమిండియా గెలుపు బృందంలో సిరాజ్ ఉన్నారు.

ఆ తర్వాత హైదరాబాద్‌లో అడుగుపెట్టిన సిరాజ్‌కు హైదరాబాద్‌లో క్రికెట్ అభిమానులు ఘనస్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సిరాజ్‌ను సన్మానించింది.

# హైదరాబాద్‌లో దారుణం

## ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అమ్మవారి విగ్రహం ధ్వంసం

## దర్యాప్తు చేపట్టిన నగర పోలీసులు

హైదరాబాద్,అక్టోబర్11(నమస్తే ఉదయం): హైదరాబాద్ నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో దారుణం చోటు చేసుకుంది. దేవి నవరాత్రుల సంద ర్భంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని గత అర్ధరాత్రి దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి.. నిర్వాహకులకు సమాచారం అందించారు. దీంతో అమ్మవారి భక్తులతోపాటు పలు హిందు సంఘాల నేతలు.. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న బేగంబజార్ పోలీసులు నాంపల్లి గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్‌తోపాటు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేశారు. నాంపల్లి ఎగ్జిబిషన్



గ్రౌండ్స్‌లోకి ప్రవేశించిన దుండగులు తొలుత విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఆ తర్వాత ఆ ప్రదేశంలోని సీసీ కెమెరాలను పగలకొట్టారు. అనంతరం అమ్మవారి విగ్రహం చేతిని విరగొట్టారు. అంతేకాకుండా అమ్మవారి విగ్రహం వద్దనున్న పూజా సామాగ్రిని సైతం చెల్లాచెదురుగా పడేశారు. అమ్మవారి విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్లను సైతం దుండగులు తొలగించారు.



# కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో దుర్గామాత పూజలు

బండ్లగూడ, అక్టోబర్ 11 (నమస్తే ఉదయం): బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో గల విద్యుత్ సబ్ స్టేషన్‌లో దుర్గాష్టమి పూజలు ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్ స్పెక్టర్ బాబురావు,లైన్ మ్యాన్ వరప్రసాద్, ఆర్టిజన్ నరసింహ, విష్ణువర్ధన్ రెడ్డి, మీటర్ రీడర్లు నరేష్, సుధాకర్, అజ్మత్, అనిల్, తేజ, కిషోర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



# కులమతాలకు అతీతంగా అందరికీ విద్య

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వమే చెల్లిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యతతో కూడిన విద్యను అందించాలన్న లక్ష్యంతో సమీకృత గురుకులాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. కులమతాలకు అతీతంగా అందరినీ ఒక్కటి చేయటమే ప్రభుత్వ లక్ష్యమని.. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో ప్రజల్లో మత సామరస్యం పెరుగుతుందని అన్నారు. కొందరు ప్రభుత్వాన్ని అవమానించటమే పనిగా



పెట్టుకున్నారని అన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యార్థులకు భోదన అందిస్తామని.. సకల సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తామని అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం కోసం ఈ ఏడాదికి రూ.5వేల కోట్లు కేటాయించామని అన్నారు భట్టి విక్రమార్క. మొదటి దశలో 28 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకి శంఖుస్థాపన చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం కులం ,మతం పేరు మీద గురుకులాలు ఏర్పాటు చేశారని.. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా అందరూ కలిసి ఒక్క దగ్గర చదువుకుంటారని అన్నారు. రాష్ట్ర ,దేశ నిర్మాణానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా 25 వేల పాఠశాలలో రూ. 1100 కోట్లతో మౌలిక వసతులు కల్పించామని అన్నారు.

# టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా నోయల్ టాటా

(మొదటి పేజీ తరువాయి)

వైస్ ఛైర్మన్‌గానూ ఉన్నారు. శ్రీ రతన్ టాటా ట్రస్ట్ బోర్డులోనూ నోయల్ సభ్యుడిగా ఉన్నారు. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో టాటా ట్రస్ట్స్‌కే అత్యధికంగా 66శాతం వాటా ఉంది. అందువల్ల టాటా టస్ట్÷=సక్రు ఛైర్మన్ హోదాలో ఉన్న వ్యక్తి.. గ్రూపు కంపెనీల కార్యకలాపాలు, వృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ఇప్పటివరకు టాటా ట్రస్ట్స్ ఛైర్మన్‌గా రతన్ టాటా ఉన్నారు. ఆయన మరణంతో టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ పదవి ఖాళీ అయ్యింది. ఇప్పుడు ఈ బాధ్యతలను నోయల్ టాటాకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఈ పదవి విషయంలో తొలుత వేర్వేరు పేర్లు వినిపించిన్పటికీ.. నోయల్ టాటాకే పగ్గాలు అప్పగించడం విశేషం. 1991లో రతన్ టాటాకు టాటా గ్రూప్ బాధ్యతలు అప్పగించారు. అప్పుడే ఆయన టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ పదవి చేపట్టారు. టాటా గ్రూప్‌లోని రిటైల్ కంపెనీ ట్రెంట్, టాటా ఇంటర్నేషనల్ లిమిటెడ్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా / టాటా స్టీల్, టైటన్‌లకు వైస్ ఛైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ట్రెంట్ హయాంలో సాధించిన విజయాలు సర్వత్రా ప్రశంసలు అందుకున్నాయి. ట్రెంట్ మార్కెట్ క్యాప్ రూ.2.93 లక్షల కోట్లకు చేరుకుంది. నోయెల్ టాటా ఆగస్టు 2010 నుంచి నవంబర్ 2021 వరకు టాటా ఇంటర్నేషనల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. ఆయన పదవీ కాలంలో కంపెనీ టర్నోవర్ 500 మిలియన్ డాలర్ల నుంచి 3 బిలియన్ డాలర్లకు పెరిగింది.

# దసరా శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మనిషి తనలోని చెడు మీద నిత్యం పోరాటం చేస్తూ మంచి దిశగా విజయం సాధించాలనే జీవన తాత్వికతను విజయ దశమి మనకు తెలియజేస్తుందని పేర్కొన్నారు.

దసరా రోజు శుభసూచకంగా పాలపిట్టను దర్శించి షమీ వృక్షానికి పూజ చేసి, జమ్మి ఆకును బంగారంలా భావించి పెద్దలకు సమర్పించు కుని వారి ఆశీర్వాదం తీసుకోవడం ఆచారం. తెలంగాణ ప్రజల జీవితాల్లో దసరా పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. అలాయ్ బలాయ్ తీసుకుని పరస్పర ప్రేమాభిమానాలను పంచుకోవడం ద్వారా దసరా పండుగ సందర్భంగా ప్రజల నడుమ సామాజిక సామరస్యం ఫరిడవిల్లుతుంది అని కేసీఆర్ తెలిపారు.

# ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు.. ప్రభుత్వం జీవో జారీ

(మొదటి పేజీ తరువాయి)

సమన్వయం చేసుకుంటూ కొనసాగనున్న ఈ కమిటీలు.. లబ్దిదారులకు అవగాహన కల్పిస్తాయి. శనివారం నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. కమిటీల కోసం పేర్లు పంపాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం ఆదేశించింది.

# ఎస్సీ వర్గీకరణకు అడుగు

(మొదటి పేజీ తరువాయి)

చూడాలని సీఎస్‌కు సూచించారు. మంత్రివర్గ ఉప సంఘానికి అందిన వినతులపైనా సమావేశంలో చర్చించడంతో పాటు, వాటన్నింటినీ ఏకసభ్య కమిషన్‌కు అందించాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయి నుంచి విజ్ఞప్తులు, ఫిర్యాదుల స్వీకరణకు ఉమ్మడి పది జిల్లాల్లో ఒకోరోజు పర్యటించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు.



మార్కెట్‌లో పూలు విక్రయిస్తున్న



పండుగ సరుకులతో..



మార్కెట్‌లో పూలు విక్రయిస్తున్న

# మార్కెట్లలో దసరా సందడి



కిటకిటలాడుతున్న గద్వాల మార్కెట్

## కిటకిటలాడిన షాపింగ్‌మాల్‌లు, వస్త్ర దుకాణాలు ,

## ఆకాశాన్నంటిన పూలు, గుమ్మడికాయలు, పూజా సామగ్రి ధరలు

**గద్వాల,అక్టోబర్ 11(నమస్తే ఉదయం):** జిల్లావ్యాప్తంగా పట్టణాలు, మండల కేంద్రాల్లో శుక్రవారం దసరా సందడి నెలకొన్నది. షాపింగ్‌మాల్‌లు, పూలు, పండ్లు, గుమ్మడికాయలు దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. జిల్లాకేంద్రమైన గద్వాలలో పాతబస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా పూలు, గుమ్మడికాయల దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. పండుగ నేపథ్యంలో రేట్లు విపరీతంగా పెంచేశారు. సాధారణ రోజుల్లో బంతి పూలు కిలో రూ.60 నుంచి రూ.80 ధర పలుకుతాయి. ప్రస్తుతం బంతిపూలు కిలో రూ.120 వరకు విక్రయిస్తున్నారు. మామూలు రోజుల్లో చామంతి కిలో రూ.400 కాగా.. రూ.600కు విక్రయించారు. సాధారణ రోజుల్లో రూ.75 పలికే గుమ్మడికాయలను రూ.120కి విక్రయిస్తున్నారు. తప్పనిసరి కావడంతో ధరలు పెంచినా వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు.

### గద్వాలలో దసరా సందడి

ఆయుధ పూజ, దసరా పండుగ పురస్కరించుకుని గద్వాలలో పూలు, పండ్ల ధరలు ఆకాశాన్ని తాకాయి. పండుగ సామగ్రి కొనుగోలు చేయడానికి పట్టణ, గ్రామీణ ప్రజలు పెద్ద ఎత్తున మార్కెట్లకు తరలివచ్చారు. ఇదిలా ఉంటే నెల రోజులు పడిపోయిన పూల ధరలు దసరా సందర్భంగా అమాంతం పెరిగాయి. దుస్తులు, కిరాణా షాపులు, షాపింగ్ మాల్స్, మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. డ్రెస్సులు, పండగ సామాను కొనుగోలు చేస్తూ జనం బిజీబిజీగా ఉన్నారు. పండగకు స్వగ్రామాలకు తరలివచ్చే, ఇతర ఊర్లకు వెళ్లే ప్రయాణికులతో బస్టాండ్‌లు కిక్కిరిసిపోతున్నాయి. శనివారం విజయ దశమి కావడంతో గురువారం, శుక్రవారాలలో గద్వాల పట్టణంలో జోరుగా క్రయ విక్రయాలు జరిగాయి.



# దుర్గామాత కృప ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## మార్కడేయనగర్‌లో నవరాత్రి ఉత్సవాలు సంతోషకరం

## అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, అక్టోబర్ 11(నమస్తే ఉదయం):** నవరాత్రి పూజలు అందుకుంటున్న అమ్మవారి కృప రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజల పై ఎల్లవేళ్లాల ఉండాలని ఆ దుర్గామాతను కోరుకున్నట్లు స్థానిక శాసన సభ్యుడు టి.ప్రకాష్ గౌడ్ తెలిపారు. తన నియోజకవర్గం ప్రజల్లో భక్తిభావాలు అధికమని, ఉత్సవాలు, పర్వ దిన వేడుకలు శాస్త్రోక్తంగా జరుపుకోవడం చాలా ఆనందం కలిగిస్తుదన్నారు. శుక్రవారం మార్కడేయనగర్, లక్ష్మీ గూడ, కాటేదాన్, మైలార్ దేవ్ పల్లి, దుర్గానగర్, రాజీవ్ గృహకల్ప తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన మండపాల్లో పూజలందుకుంటున్న అమ్మ వారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సంద ర్భంగా మార్కండేయనగర్ బస్తీ వాసులు నవరాత్రి ఉత్సవాలను భక్తి, శ్రద్ధలతో యువత దీక్ష బూని నిర్వహిస్తుండడం ఆ తల్లి కృపకు పాత్రులను తప్పక చేస్తుందన్నారు. అందరు కలసి మెలసి పూజా కార్యక్రమాలు చేప్పడం వల్ల ఇక్కడి వస్తే భక్తితో కూడిన వాతావరణం ఎప్పుడూ సంతోషాలను పంచుతుందని గుర్తు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ, బస్తీ పెద్దలతో కలసి కొద్ది సేపు కూర్చొని ఎమ్మెల్యే చర్చించారు.

ఈ కార్యక్రమంలో బస్తీ కమిటీ అధ్యక్షుడు విడెం రమేష్, దేవాలయ కమిటీ అధ్యక్షుడు గద్దె కృష్ణ, కమిటీ మాజీ అధ్యక్షులు ఏర్వ సత్యనారాయణ, పగిడిమర్రి సూర్య నారాయణ. ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్ కుమార్, ఉపాధ్యక్షుడు తిరుగరి గోపాల్, ప్రతినిధులు శిరందాసు నరేందర్, తిరుగరి లక్ష్మణ్, నవోదయ యూత్ అధ్యక్షుడు కోట పవన్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నవీన్, ప్రతినిధులు మల్లేష్, శివ, సాయి, కాంగ్రెస్ నాయకులు టి. ప్రేమ్ గౌడ్, కళ్లెం లక్ష్మారెడ్డి, బోనకుర్తి రాము, శ్రీనివాస్ రెడ్డి, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణపై పోస్టర్ విడుదల చేసిన జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 11(నమస్తే ఉదయం):** బాలల హక్కుల పరిరక్షణపై రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్ ను శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ బి.యం. సంతోష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాల బాలికలపై లైంగిక వేధింపులు చేయడం నాన్-బేలబుల్ నేరమని, చట్టరీత్యా కఠిన శిక్షలు అమలవుతాయని తెలియజేశారు. బాలలపై ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని వేధింపులకు పాల్పడిన వారిపై తగిన శిక్షలు విధించబడతాయని అన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 ప్రకారం లైంగిక వేధింపులకు పాల్పడిన వారికి 3 సంవత్సరాల జైలు శిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా విధించబడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 24 ప్రకారం, 6-14 సంవత్సరాల పిల్లలను పని చేయించడం నిషేధం. 14-18 సంవత్సరాల పిల్లలను ప్రమాదకరమైన పనుల్లో నిమగ్నం చేయడం కూడా తీవ్రమైన నేరంగా పరిగణించ బడుతుందని అన్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారికి 6 నెలల నుంచి 2 సంవత్సరాల జైలు శిక్ష, 50 వేల రూపాయల జరిమానా విధించబడుతుందని తెలిపారు. 6-14 సంవత్సరాల పిల్లలందరికీ ప్రాథమిక విద్య అందించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21(ఎ) ప్రకారం వారి హక్కు అని, పిల్లల ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం 2009 ప్రకారం ఆ పిల్లల విద్యను నిర్దేశిత సమయానికి అందించడం తల్లిదండ్రుల బాధ్యత అని కలెక్టర్ వివరించారు. ప్రాథమిక విద్య అందించడం ప్రభుత్వ కర్తవ్యమేకాకుండా, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం 2006 ప్రకారం, 18 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న ఆడపిల్లల వివాహం, 21 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న మగపిల్లల వివాహం నేరమని అన్నారు.

ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి 2 సంవత్స రాల జైలు శిక్ష లేదా 1 లక్ష రూపాయల జరి మానా విధించబడుతుందని అన్నారు. బాల్య వివాహానికి అనుమతి ఇచ్చిన, ప్రోత్సహించిన, నిర్వహించిన వారందరూ నేరస్తులుగా పరిగణించ బడతారని తెలిపారు. 1956 మానవ అక్రమ రవాణా నిషేధక చట్టం ప్రకారం, మనుషులను అమ్మడం, కొనుగోలు చేయడం నిషేధించబడిం దని అన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 23 ప్రకారం, బానిసత్వం, బలవంతపు భిక్షాటన, వ్యభిచారం కూడా నిషేధితమని అన్నారు. పిల్లల హక్కులు, మహిళల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో సాయం పొందడానికి టోల్-ఫ్రీ నంబర్లు చైల్డ్ లైన్: 1098, ERSS: 112, పోలీస్: 100, సఖి: 181 సంప్రదించాలన్నారు. బాలల హక్కులు రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని, ప్రతి కుటుంబం, సమాజం, కలిసి కృషి చేయాలని అన్నారు.

ఈ చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ,నర్సింగ రావు ,డిడబ్ల్యూఓ కే.సుధారాణి, తదితరులు,పాల్గొన్నారు.



# వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**కొత్తకోట, అక్టోబర్ 11(నమస్తే ఉదయం):** మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు దరి చేరకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వనపర్తి జిల్లాకలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.

శుక్రవారం కొత్తకోట మండలంలోని కానాయపల్లి గ్రామంలో పర్యటించి డ్రై డే నిర్వహణను పరిశీలించారు. గ్రామంలో ఇటీవల డెంగ్యూ బారిన పడిన వారి ఇంటిని సందర్శించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విష జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు పరిసరాలను పరి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డ్రమ్ములు లేదా కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామంలోని వీధుల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రత గురించి ఆశా వర్కర్లు అవగాహన కల్పిస్తున్న విధానాన్ని పరిశీలించారు. గ్రామంలో ఫీవర్ సర్వే వివరాలను పరిశీలించారు. గ్రామంలో దోమల బెడద తగ్గించేందుకు ఫాగింగ్ చేయాలని పంచాయతి కార్యదర్శికి సూచించారు. అంతకుముందు కొత్తకోటకు మంజూరు అయిన 50 పడకల ఆస్పత్రి కోసం తహసీల్దార్ తో కలిసి గుంపుగట్టు సమీపంలో స్థల పరిశీలన చేశారు.



### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సందర్శన

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చూసుకోవాలని, అవసరమైన మందుల్ని సీడీఎస్ నుంచి తెప్పించాలని వైద్యాధికారులకు సూచించారు. కొత్తకోట, మున్సిపాలిటీ కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆస్పత్రుల్లోని ఈడిడి, ఒపి రిజిస్టర్లను పరిశీలించిన అనంతరం ఐపీ, డెలివరీ వార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఐపీ వార్డులో చికిత్స పొందుతున్న గర్భిణులకు హిమోగ్లోబిన్ మెరుగుదల కోసం మంచి ఆహారాన్ని తీసుకోవాలని



జాగ్రత్తలు చెప్పారు. రోగులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్త కుండా ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.


కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణుల డెలివరీల వివరాలను అడిగిన కలెక్టర్ మెరుగైన పనితీరు కనబరిచిన సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుకేషినివిశ్వేశ్వర్, డిఎం హెచ్ఓ సాయినాథ్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ స్వర్ణ సింగ్, మున్సిపల్ కమిషనర్ పవన్ కుమార్,తాసిల్దార్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు రాములు యాదవ్, చీర్ల నాగన్న సాగర్, తదితరులు పాల్గొన్నారు.



రాంబాగ్ దుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న గంగిడి నీరజా పుల్లారెడ్డి దంపతులు

# రాంబాగ్ దుర్గామాత ఆలయంలో ఘనంగా చండీ హోమం

**రాజేంద్రనగర్, అక్టోబర్ 11(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ రాంబాగ్ ఆలయంలో చండీ హోమం ఘనంగా జరిగింది. శనివారం రాంబాగ్ దుర్గామాత గుడిలో చండీ హోమంలో గంగిడి నీరజ పుల్లారెడ్డి, కోలన్ జైపాల్ రెడ్డి దంపతులు, శ్రీకాంత్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## అశోక్ గౌడ్ కూతురు వివాహ వేడుకలకు
# హాజరైన బిజెపి అగ్ర నాయకులు

**శంషాబాద్, అక్టోబర్ 11(నమస్తే ఉదయం):**
భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లే అశోక్ గౌడ్. మాజీ ఎంపీటీసీ రేపల్లె జ్యోతి కూతురు మని చందన వివాహము మనీ కిరణ్ గౌడ్ తో ఘనంగా జరిగింది. ఈ వివాహ మహెూత్సవానికి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్. చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ . రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. షాద్నగర్ ఎమ్మెల్యే శంకరయ్య. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్. కూన శ్రీశైలం గౌడ్. బిజెపి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్. మైలార్దేవ్పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి. మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్. శ్రీ వర్ధన్ రెడ్డి అందె బాబయ్య. విష్ణువర్ధన్ రెడ్డి. షాద్నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్. మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం. రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి బీసీ సెల్ అధ్యక్షుడు అనగోనే భాస్కర్ గౌడ్ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# దొంగతనాలకు పాలు పాడిన వ్యక్తి అరెస్ట్

**కొత్తకోట, అక్టోబర్ 11(నమస్తే ఉదయం):**
ఇండ్లల్లో దొంగతనాలు చేస్తూ తప్పించుకొని తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...
కొత్తకోట పట్టణంలోని విద్యానగర్ కాలనీలో తేదీ 06.10. 2024 నాడు కోమలకల్లా శివ అనే




వ్యక్తి ఇంట్లో దొంగతనం చేయగా సమాచారం మేరకు శుక్రవారం ఉదయం 7 గంటలకు బుడగ జంగం రామకృష్ణ మరియు అతని రెండో భార్య మౌనిక వనపర్తి రోడ్ లో గుంపుగట్టు వద్ద అనుమానాస్పదంగా బైక్ పై వెళుతుండగా ఇద్దరినీ పట్టుబడి చేసి విచారించగా విద్యా నగర్ కాలనీలో మరియు పాలెం గ్రామంలోనీ ఒక ఇంటిలో చేసిన దొంగతనాలను నేరస్తులు చేశా అని ఒప్పుకొనుగా వారి దగ్గర నుండి 1.6 తులం బంగారం, 1.5 కేజీ వెండి ని సీజ్ చేయడం జరిగిందని. సీజ్ చేసిన వస్తువుల విలువ 1,00,350/-(ఒక లక్ష 350 రూపాయలు) ఉంటుందని. దొంగలను రిమాండ్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై మంజునాథరెడ్డి తెలిపారు.

# పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 11(నమస్తే ఉదయం):**
ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన గోవర్ధన్ కుటుంబానికి గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత



పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదవ తరగతి విద్యను అభ్యసించిన సహా విద్యార్థులు రూ. 50,000 ఆర్థిక సహాయం అందించారు. వారి కుటుంబ సభ్యులు ఆ నగదును గోవర్ధన్ కూతురు విద్య పేరుమీద బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో 1999-2000 ఎస్ఎస్ సి బ్యాచ్ మిత్రులు ఆంజనేయులు రాముడు, మహానంది, వీరేష్ ఫారుక్, వెంకటేష్, రవీంద్ర నాయుడు, పాల్గొన్నారు.
ఈ సందర్భంగా గోవర్ధన్ కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులందరికీ వారి కుటుంబ సభ్యులు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

# గాంధీనగర్‌లో బతుకమ్మ వేడుకలు

**రాజేంద్రనగర్, అక్టోబర్ 11(నమస్తే ఉదయం):**
రాజేందర్ నగర్ సర్కిల్ పరిధిలోని గాంధీ నగర్‌లో సద్దుల బతుకమ్మ సంబరాలు ఆటపాటలతో జరిగింది. మహిళలు దాండియా పాటలతో ఆడి సంబరాలు రంగ రంగ వైభవంగా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు.



## శంషాబాద్ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న
# ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి

**శంషాబాద్, అక్టోబర్ 11(నమస్తే ఉదయం):**
రాజేంద్ర నగర్ నియోజక వర్గ దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బతుకమ్మ సంబరాలు, అమ్మవారి ప్రత్యేక పూజ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి రాజేంద్ర నగర్ నియోజక వర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్.బి. నగర్, సాతం రాయి, శంషాబాద్ ఓల్డ్ పోలీసు స్టేషన్, సిద్దెంతి, లో అమ్మ వారి మండపాలలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ, దేవి శరన్నవరాత్రి ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు.సద్దుల బతుకమ్మ సంద ర్భంగా మాట్లాడుతూ మహిళలు బతుకమ్మ తొమ్మిది రోజుల పాటు జరుపుకునే బతుకమ్మ సంబరాల్లో భాగంగా సద్దుల బతుకమ్మ రంగు రంగుల బతుకమ్మ లను తయారు చేసి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను, చాటారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు దీవెనలతో ప్రజలందరు జీవితాంతం సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవితాంతం ఆనందంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.
ఈ కార్యక్రమంలో బాతుకు శ్రీనివాస్, రాహుల్ గాజుల. వంశీ యాదవ్, సందీప్, సతీష్, అవ దూత, గణేష్, మధు, బాబు, నని, ఆనంద్, తదితరులు పాల్గొనడం జరిగింది.



# రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ మరియు షార్ట్‌ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

## - జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు

**గద్వాల్, అక్టోబర్ 11(నమస్తే ఉదయం):**
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే)ను పురస్కరించుకొని జిల్లా పరిధిలో గల ఔత్సహిక ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ , షార్ట్ ఫిల్మ్ కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈనెల 21 న వారోత్సవాలు నిర్వహించబడుతాయని ఈ పోటీలకు విద్యార్థులతో పాటు, యువత ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు ఉత్సహంగ పాల్గొనాలని అన్నారు. ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే ఇటీవల కాలంలో తీసిన (3) ఫోటోలు మరియు తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 20వ




తేదీలోపు జిల్లా పోలీస్ కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్, 10 x 8 సైజ్ ఫోటోలను పోలీస్ పిఆర్వో కు అందజేయాలన్నారు.
ఈ పోటీలకు నామినేషన్లు పంపించే ఔత్సహికులు మూడనమ్మకాలు, ఇతర సామాజిక లు అత్యవసర సమయాల్లో పోలీసులు స్పందన, ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను, సైబర్ నేరాలు ఈవ్టీజింగ్,ర్యాగింగ్, మత్తు పదార్థాల సేవనం వాటి అనర్థాలు పెంపొందించే అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2023 అక్టోబర్ నుండి ప్రస్తుత సంవత్సరం అక్టోబర్ నెల ఇప్పటివరకు తీసిన మూడు ఫోటోలు, షార్ట్ ఫిల్మ్ మాత్రమే పంపించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 20 లోపు జిల్లా పోలీసు ప్రదాన కార్యాలయంలోని పీఅర్ఓ సెక్షన్ నందు ఇవ్వాల్సి వుంటుందని మరిన్ని వివరాల కోసం 87126 61828 నెంబర్ ద్వారా పీఆర్ఓ ను సంప్రదించాలన్నారు.
సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం శ్రమించి తమ అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నిర్వహిస్తున్న పోటీలకు విద్యార్థులతో పాటు, ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు పిలుపునిచ్చారు.

# ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు

**గద్వాల(కేటీ దొడ్డి) (నమస్తే ఉదయం):**
గద్వాల జిల్లా కేటీ దొడ్డి మండలం చింతలకుంట గ్రామం రైతు వేదిక నందు మహిళ శిశు సంక్షేమ శాఖ వారి జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్యర్యంలో మరియు ఎంవీ ఫౌండేషన్ సహకారంతో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ముందుగా బాలికతో భేటీ బచావో భేటీ పఢవో అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు.
ఈ కార్యక్రమానికీ ముఖ్య అతిథిగా మండల స్పెషల్ ఆఫీసర్ గారు హాజరై మాట్లాడుతూ బాలికలకు అంతర్జాతీయ బాలిక దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు మరియు బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు (విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహం)పై, వివక్షతపై అవగాహన పెంచడం మరియు అమ్మాయిలు మరియు అబ్బాయిలు ఇద్దరికీ విద్యను అందించడం చాలా ముఖ్యం. బాల్య వివాహాల వంటి ఆచారాలను అరికట్టడమే కాకుండా సమాజాభివృద్ధికి మార్గం సుగమం చేయడమే బాలికల దినోత్సవ ముఖ్య ఉద్దేశం అని అన్నారు.
జిల్లా బాలల సంరక్షణ అధికారి నర్సింహ మాట్లాడుతూ ముందుగా బాలికలందారికి అంతర్జాతీయ బాలిక దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు మరియు చిన్న వయసులోనే పెళ్లిలు చేయడం చట్ట రీత్యా నేరం అని చెప్పారు, అమ్మాయిలకు 18 సంవత్సరాలు పూర్తిగా నిండిన తర్వాతనే




వివాహం చేసుకోవాలని అన్నారు, అయితే ఇలా బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే డయల్ 100 లేదా 1098 కి ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. మరియు రక్షణ సంరక్షణ అవసరమైన పిల్లల కోసం ఈ బాల రక్ష భవన్ ఏర్పాటు చేశారని, బాల రక్ష భవన్ అందిచే సేవలు గురించి వివరించారు.
ఈ కార్యక్రమంలో డీసీపీఓ నర్సింహ, మాజీ జేపీటీసీ రాజశేఖర్ రెడ్డి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, మాజీ సింగల్ విండో డైరెక్టర్ రఘు శెట్టి, అగ్రికల్చర్ ఆఫీసర్ నర్సింహులు, ఐసీపీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, ఎంవీ ఫౌండేషన్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, బాలికలు. మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయ వృత్తి
# ఎంతో గౌరవనీయమైనది

### జే ఎస్ ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు

**కొత్తకోట, అక్టోబర్ 11(నమస్తే ఉదయం):**
ఈనెల 9వ తేదీన హైదరాబాదులో సెకండరీ గ్రేడ్ టీచర్ గా ఉపాధ్యాయ ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకున్న కొత్తకోట ఎస్సీ కాలనీకి చెందిన కొండమ్మ - రాములు దంపతుల కుమారుడు నారమన్ నవీన్ కుమార్ ను జే.ఎస్.రాములు



ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.భక్తరాజు, జె.అమృతరాజు మాట్లాడుతూ... సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవనీయమైనదని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల కన్నా చాలా గొప్పదని చెప్పారు. ఈ సందర్భంగా డీఎస్సీ ఉద్యోగ విజేత నవీన్ కుమార్ ను శాలువాతో సన్మానిస్తూ అందరికి ఆదర్శప్రాయుడైన భారత రాజ్యాంగ నిర్మాత, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సతీష్ రాజు, మహిమ రాజు, కర్ణ కుమార్, లెక్చరర్ సంతోష్ రాజు, జూనియర్ లైన్ మెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



హరి కిరణ్ గౌడ్ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతున్న మిత్రులు

## ఘనంగా హరికిరణ్ గౌడ్
# జన్మదిన వేడుకలు

### హరికిరణ్ గౌడ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన స్నేహితులు

**రాజేంద్రనగర్, అక్టోబర్ 11(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ చెందిన జి హరి కిరణ్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం హరి కిరణ్ గౌడ్ జన్మదినం సందర్భంగా స్నేహితులు, కుటుంబ సభ్యులు ఆయన చేత కేకు కట్ చేయించి సత్కరించి శుభ కాంక్షలు తెలిపారు. హరికిరణ్ గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో కె శ్రీనివాస్ గౌడ్, ఎస్.కె నజీర్ మూల రమేష్ గౌడ్ , ఎం సంతోష్, ఏం నిరంజన్ , ఎండి వాజిద్, ఏం గోపాల్ రెడ్డి, పెండ్యాల దశరథ్, ఎం నాగరాజ్ , గాలి వెంకటేష్, డీ మల్లేష్ యాదవ్, ఎల్ నరేష్ కుమార్, ఏ శివకుమార్ యాదవ్, జి రవి కిరణ్ గౌడ్, ఎస్ హనుమంతు నాయక్, దానం అనుమంతు, సిహెచ్ ప్రభాకర్ గౌడ్,తొడ బోయిన నరసింహ, బి రత్నాచారి , శంకర్ చారి,రాజు నాయక్,సాగర్ వెంకటేష్, శ్రీనివాస్ చారి,ఇబ్రహీం ఖాన్ ,సినీ ఆర్టిస్ట్ శివ, తదితరులు పాల్గొన్నారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733